నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ ఫీడర్ పరిధిలోని సాయినగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, రాఘవేంద్ర కాలనీ, సాయికళ్యాణ మండపం, జయశంకర్‌కాలనీ ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు... మాధవరంనగర్ ఫీడర్ పరిధిలోని మాధవరం నగర్, కమలప్రసన్న నగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్–1లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బి. శరత్‌బాబు తెలిపారు.

22వ తేదీ వరకు ఓటరు నమోదు కార్యక్రమం

మూసాపేట: ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉందని మూసాపేట డీసీ రమేష్ తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు, పేరు, చిరునామాలో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువు కనుమరుగు


గంగారం పెద్దచెరువులో అక్రమంగా మట్టి పోస్తున్న ఆక్రమణదారులు

గంగారం చెరువులో పెద్ద ఎత్తున మట్టి డంపింగ్

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్దచెరువులోకి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పీజేఆర్ ఎన్‌క్లేవ్‌కు వెళ్ళేదారి నుంచి అయ్యప్ప స్వామి దేవాలయం వెనుకాల నుంచి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో పూర్తిగా మట్టి నింపి నిర్మాణాలకు తెరలేపుతున్నారు. చెరువు సుందరీకరణ పేరుతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టినా అక్కడక్కడ కొన్ని సమస్యల వల్ల నిలిచిపోయింది. ఇదే అదునుగా చూసుకున్న ఆక్రమణదారులు రాత్రి సమయాలలో లారీ, ట్రాక్టర్ల ద్వారా చెరువులో మట్టిని పోస్తున్నారు. ఇటీవల స్థానికులు మట్టి తరలింపుపై తహశీల్దార్, ఇరిగేషన్ శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు కేవలం సదురు వ్యక్తి తెలియకుండా చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఇంకా ఈ మట్టి తరలింపును నిలువరించకుంటే పెద్ద చెరువు పూర్తిగా కనుమరుగవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా చెరువులో మట్టిని తరలిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి, శేరిలింగంపల్లి మండల తహశీల్దార్, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, సర్కిల్ 21 ఉపకమిషనర్‌లకు ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

గంగారం పెద్ద చెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయి. దీనిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అక్రమదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– నారాయణ, ఈఈ ఇరిగేషన్ శాఖ

చెరువులో మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు

చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువులో మట్టి తరలింపుపై ఇరిగేషన్ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత వారిపై కేసు నమోదు చేశాం. దర్యాప్తు చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.
– పాలవెల్లి, చందానగర్ ఎస్‌హెచ్‌ఓ

నేటి నుంచి ఆర్టీసీ సంక్రాంతి ప్రత్యేక సర్వీసులు

మూసాపేట: ఆర్టీసీ సంక్రాంతి ప్రత్యేక సర్వీసులను గురువారం నుంచి నడిపిస్తున్నట్లు డిప్యూటీ ఆర్ఎం కవిత తెలిపారు. జగద్గిరిగుట్ట బస్‌స్టాప్ నుంచి హన్మకొండ, వరంగల్ సెక్టార్ వనపర్తికి, బీరంగూడ, లింగంపల్లి, చందానగర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలైన కాకినాడ, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, అనంతపురానికి ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ వారి సౌజన్యముతో అవంతినగర్ తోట కమ్యూనిటీహాల్‌లో నివసించే ప్రజల కోసం ఈనెల 12వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ప్రముఖ వైద్య నిపుణులు డా. బసవయ్య, డా. మౌనికా రెడ్డి ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవంతినగర్ అసోసియేషన్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు గార్లపాటి మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కార్మికుడికి అన్యాయం జరిగితే సహించేది లేదు

శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్


డ్రైవర్, క్లీనర్‌కు కంపెనీ నుంచి రావాల్సిన జీతాన్ని ఇప్పించిన రవిసింగ్ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రశాంత్‌నగర్ ఇండస్ట్రీ ఏరియాలో శ్రీశివదుర్గ ఇండస్ట్రీస్ కంపెనీలో కొన్నేళ్ల నుంచి డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్న డ్రైవర్ అభిషేక్ కుమార్, క్లీనర్ ఆశిష్‌కుమార్‌లు అనివార్య కారణాల వల్ల కంపెనీకి రాకపోవటంతో కంపెనీ యాజమాన్యం డ్రైవర్, క్లీనర్‌ను ఇద్దరిని డ్యూటీలో నుంచి తీసివేశారు. ఇద్దరు కార్మికులకు గతేడాది ఆగస్టు నెల వేతనం రావాల్సి ఉండగా ఎన్నిసార్లు యాజమాన్యంతో అడిగినా పట్టించుకోక బెదిరించి పంపించారు. విషయం తెలుసుకున్న కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ ఇద్దరు కార్మికులను కంపెనీకి తీసుకెళ్లి కంపెనీ యజమానులతో మాట్లాడారు. వారికి రావాల్సిన ఆగస్టు నెల జీతం రూ.38వేలను ఇప్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచారి, మనోజ్‌కుమార్, అనిల్‌కుమార్, సుదర్శన్, జగన్ పాల్గొన్నారు.

రాంనరేష్‌నగర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు, కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్‌నగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాదయాత్ర చేపట్టారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో పాటు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఆయనతో కలిసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతామని అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు.

◆ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు స్థానిక సమస్యలను త్వరగా పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రాంనరేష్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. త్వరలోనే డ్రైనేజీ నిర్మాణం , మ్యాన్‌హోల్స్ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. త్వరలో రోడ్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఏఈ రాజీవ్, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

బాలానగర్: గౌతమ్‌నగర్ ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులో గతేడాది డిసెంబర్ 29వ తేదీన గుర్తుతెలియని వృద్ధుడు పడిపోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 11గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రక్త సంబంధీకులు ఎవరైనా ఉన్నట్లయితే బాలానగర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ



మూసాపేట: కూకట్‌పల్లి ముంబై జాతీయ రహదారిపై కారును ఓ లారీ ఢీకొట్టింది. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి నుంచి వై జంక్షన్ వైపు వెళ్తున్న కారును పిల్లర్ నం.832 వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

దుండిగల్: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీ–పోచంపల్లి రాజరాజేశ్వర కాలనీకి చెందిన మంగలి కృష్ణ(60) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం తన బైక్‌పై దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో సారెగూడెం ఉజ్వల రెస్టారెంట్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొట్టింది. లారీ చక్రాలు అతడిపై నుంచి వెళ్లింది. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న కృష్ణను సూరారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మురళీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు


అవంతినగర్ ఈస్ట్‌కాలనీలో అక్షింతలను పంపిణీ చేస్తున్న అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేయటం తమ అదృష్టంగా భావిస్తున్నామని అవంతినగర్ ఈస్ట్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. బుధవారం కాలనీలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. ప్రతి ఒక్కరూ ఈనెల 22న జరిగే స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం టీవీలో వీక్షించి పునీతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఏ. వీరబాబు, జనరల్ సెక్రటరీ టి.దేవేందర్‌రావు, వీణకుమారి, సత్యనాదం, ఏలేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుశీల్‌కుమార్, శివకుమార్, బి.శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బారావు, హరీష్ పాల్గొన్నారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్

బాలానగర్: బాలానగర్‌లోని ఐడీపీఎల్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని ట్రక్, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు స్వచ్ఛందంగా డ్రైవర్స్ బంద్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేసి అడ్డదారిలో డ్రైవర్లను బతికి ఉండగానే చనిపోయినట్లుగా ఉండే చట్టం తెచ్చారని పేర్కొన్నారు.

◆ ఈ చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.7లక్షల నష్టపరిహారం ఇచ్చేలా చట్టం తెచ్చి డ్రైవర్లను పనిచేయకుండా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షలతోనే ప్రమాదాలు తగ్గుతాయనేది గుడ్డి ఆలోచన అని విమర్శించారు. ముందు కేంద్ర ప్రభుత్వం రోడ్లపై గుంతలు లేకుండా చూడాలన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమేష్‌రెడ్డి, విష్ణు, మోసిన్, శేఖర్, నరేష్, సత్యం, భాస్కర్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి క్రైస్తవుల సమస్యలను పరిష్కరించండి


ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీలతో శేరిలింగంపల్లి క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడిగాంధీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెట్టెబావి ఆనంద్, పాస్టర్ కోముసాగర్, పాస్టర్ మాణిక్యం, పాస్టర్ యేసురాజు, జైపాల్, సువార్తమ్మ పాల్గొన్నారు.

ఎంపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు ఇబ్రహీం, రాము, షకీర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం


అంజయ్యనగర్‌లో స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో వీఆర్ ఆస్పత్రి ఎండీ నందకిషోర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని బుధవారం టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న వీఆర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. వైద్యులు బీపీ, షుగర్, దంత, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. డాక్టర్లు శ్రీకాంత్, శ్రావణి, రచన, సిబ్బంది మంజుల, మధురరాణి, ఖతీజా, ఆఫ్రీన్, సమీక్ష, అంబిక, కళ్యాణ్ పాల్గొన్నారు.

పట్టాభూమిని ప్రభుత్వభూమిగా చేస్తున్న ఆరోపణలు తగవు

- ఐదు దశాబ్దాల క్రితం కొనుగోలు చేశాం
- భాగ్యనగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ లిమిటెడ్


సేవ్ భాగ్యనగర్ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రాజా ఉమారెడ్డి

మోతీనగర్: భాగ్యనగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ లిమిటెడ్‌పై ఇటీవల ఓ రాజకీయ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని అధ్యక్షుడు రాజా ఉమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ భాగ్యనగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ లిమిటెడ్ కార్యాలయం ఆవరణలో సేవ్ భాగ్యనగర్ పేరిట విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 దశాబ్దాల కిందటే తాము దివంగత నవాబ్ రయీస్ యార్ జంగ్ బహద్దూర్ కుటుంబ సభ్యుల వద్ద 1400 మంది సర్వే నెంబర్ 1007లో 349 ఎకరాలుగా ఉన్న భూమిని కొనుగోలు చేశామన్నారు. దానిని 4 లేవుట్లుగా చేశామని తెలిపారు.

ప్రభుత్వానికి ఎల్ఆర్ఎస్ కూడా కట్టాం..

కానీ ఇటీవల ఒక రాజకీయ పార్టీ నేతలు నవాబ్ రయీస్ యార్ జంగ్ బహద్దూర్‌కు వారసులు లేరని ఆ భూమిని బినామీ పేర్లతో ఆక్రమించుకోవటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించటం తగదని పేర్కొన్నారు. నవాబ్ రయీస్‌కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని వారి ద్వారానే భాగ్యనగర్ సొసైటీ ద్వారా చట్టపరంగా రిజిస్టర్ చేయాల్సి ఉందన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వారి వారసులు రిజిస్ట్రేషన్ చేయించనందున భాగ్యనగర్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ లిమిటెడ్‌గా ఏర్పడి అందరం పొజిషన్‌లో ఉన్నామని తెలిపారు. తాము ప్రభుత్వానికి ఎల్ఆర్ఎస్ కూడా కట్టామన్నారు.

కోర్టులు సైతం పట్టాభూమి అని తేల్చాయి...

వివిధ కోర్టులలో కేసులు ఉన్నందున రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోతున్నామని తెలిపారు. అది కూడా తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని పేర్కొన్నారు. గతంలో అది ప్రభుత్వ భూమి కాదని, పట్టా భూమని కొన్ని సందర్భాల్లో కోర్టులు సైతం తేల్చాయని తెలిపారు. ఇట్టి ప్లాట్ల విషయంపై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వాస్తవాలను వివరిస్తామన్నారు. 1400 మంది ఇంటి యజమానులు ఇళ్లు కట్టుకొని నివాసం ఉండే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఊటుకూరు శ్రీనివాస్‌గుప్తా, మోతే లక్ష్మారెడ్డి, రవిబాబు, విష్ణువర్ధన్ రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, పి.నరసింహారావు, వినుత తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యం

జీడిమెట్ల: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ గంపల బస్తీలో నివాసముండే దేవి(35)కి కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈనెల 1వ తేదీన దేవి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబీకులు అప్పటి నుంచి పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. గతంలో కూడా ఇంటి నుంచి బయటకు వెళ్లి మూడు రోజుల తర్వాత తిరిగొచ్చింది. ఈసారి కూడా అలాగే వస్తుందని అనుకున్నా రాలేదు. దీంతో బుధవారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

జీడిమెట్ల: ఓ యువతి రూ.30 వేలు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. చింతల్ మాణిక్యనగర్‌కు చెందిన విశ్వలింగం కుమార్తె రాగవి(18) ఇంటి వద్దనే ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో రాగవి ఇంట్లో ఉన్న రూ.30వేలు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాగవి కోసం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాగవి సోదరుడు సతీష్ బుధవారం జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు హైటెక్‌సిటీకి చెందిన వరుణ్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరాగాంధీ పురం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


కాలనీ ఎన్నికల్లో గెలుపొందిన యూసుఫ్‌ను అభినందిస్తున్న బండి రమేష్ తదితరులు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం ఇందిరాగాంధీపురం కాలనీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సయ్యద్ యూసుఫ్ గెలుపొందారు. ఈ మేరకు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూసుఫ్‌ను బండి రమేష్ అభినందించారు. కాలనీ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని బండి రమేష్ హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు కాలనీవాసులకు అందే విధంగా చూడాలని సూచించారు. అనంతరం ఇదే కాలనీకి చెందిన మహమ్మద్ గౌస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నవాబు, వసీముద్దీన్, పప్పు, ఎమ్ము, ఇజాజ్, రవాజ్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూజలు



కూకట్‌పల్లి: నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం షిరిడీ సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పూజలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు శ్యామలరాజు, గోనె శ్యామలరాజు, గోనె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి ఇన్‌చార్జ్‌గా బండి రమేష్


మేడ్చల్ జిల్లా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బండి రమేష్

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన నియోజకవర్గాల్లో 55 మందికి నియోజకవర్గ అభివృద్ధి ఇన్‌చార్జ్‌లుగా పూర్తిస్థాయిలో బాధ్యతలను అప్పగించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా మేడ్చల్ జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జ్‌లకు పూర్తిస్థాయిలో బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బండి రమేష్‌కు బాధ్యతలు అప్పగించారు.

నియోజకవర్గానికి రూ.10కోట్లు:బండి

ప్రతి నియోజకవర్గానికి రూ.10కోట్ల మంజూరు చేస్తున్నారని బండి రమేష్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ విజయానికి కృషి చేయనున్నట్లు వివరించారు. త్వరలోనే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. ఈ కమిటీల్లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్‌గా ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

ఎవరైనా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి

కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: బీజేపీ పార్టీ విలువలతో కూడిన పార్టీ అని.. ఏ స్థాయి వారైనా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాల్సిందేనని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, పలువురు నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశాన్ని కాంతారావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్ఠానం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ఇలా టికెట్ విషయంలో ఊహాగానాలతో పార్టీని తప్పుపడుతూ మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి బహిరంగంగా చర్చించటం పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకమని ఆయన మండిపడ్డారు. జిల్లాకు అధ్యక్ష బాధ్యత వహిస్తున్న వారికి ఇటువంటి కనీస సూత్రాలు తెలియకపోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఆచార్య గోనానాయక్‌కు సత్కారం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఆచార్య గోనానాయక్‌కు బుధవారం హెచ్‌సీయూలో సత్కరించారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగంలో ఆయనను తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఏపీలో తెలుగు బాషా సేవ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం పట్ల పలువురు ఆచార్యులు ఆయనను అభినందించారు. శాలువాతో సత్కరించి ఆయన పొందిన పురస్కారాన్ని అందించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు పిల్లలమర్రిరాములు, పవన్‌కుమార్, డి విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ షమీమ్ జైరాజ్‌పురికి ఘన నివాళి

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ షమీమ్ జైరాజ్‌పురికి నివాళులు అర్పించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆయన సంతాప సమావేశాన్ని నిర్వహించారు. 81 ఏళ్ళ వయస్సు కలిగిన ఆయన బుధవారం న్యూఢిల్లీలో మృతి చెందారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం షమీమ్ జైరాజ్‌పురికి సంతాప సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉర్దూ విశ్వవిద్యాలయం కోసం చేసిన సేవలను కొనియాడారు. రిజిస్ట్రార్ ఇష్తియాక్ ఆహ్మద్, ప్రొఫెసర్లు షగుఫ్తా షాహీన్, సిద్ధిఖీ మహ్మద మహమూద్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

గచ్చిబౌలి: ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఓ మహిళ ప్రసవించి పండంటి ఆడశివువుకు జన్మనిచ్చింది. చందానగర్ మంజీరా పైపులైన్ రోడ్డులో నివాసం ఉండె గర్భిణీ ఉషా(23)కు పురిటి నొప్పులు రావడంతో కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు క్రిటికల్‌గా ఉందని, నిలోఫర్‌కు వెళ్లాలని అక్కడి డాక్టర్లు సూచించారు. దీంతో 108 అంబులెన్స్‌లో బయలుదేరారు. మాసబ్‌ట్యాంక్ సమీపంలో అంబులెన్స్‌లోనే ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఈఎంటీ మారుతి ప్రసాద్, పైలట్ ప్రణయ్ పురుడు పోశారు. అనంతరం తల్లి, శిశువులను నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు.

మహిళ ఆత్మహత్య

మియాపూర్: ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం మిర్జాపూర్‌కు చెందిన ముత్యం, శ్రీదేవి(37) దంపతులకు కుమారుడు సాయితేజ, కుమార్తె సావిత్రీలున్నారు. వీరు మియాపూర్‌లోని న్యూ కాలనీలో నివాసముంటున్నారు. ముత్యం గత మూడు సంవత్సరాల క్రిందట దుబాయ్‌కు వెళ్లి అక్కడే ఉండిపోయాడు. శ్రీదేవి స్థానికంగా ఇళ్లల్లో, కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పిల్లలను బడికి పంపించి శ్రీదేవి ఇంటికి గడియ వేసుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని పాల్పడింది. మధ్యాహ్నం సమయంలో కూతురు సావిత్రి ఇంటికి వచ్చి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు శ్రీదేవి ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో కిందకు దించగా అప్పటికే మృతిచెందింది. పోలీసు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కూలీ మృతి.. కేసు నమోదు

హఫీజ్‌పేట్: కూలీ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మోఫిజ్ (50) పాపిరెడ్డి కాలనీలో నివాసముంటూ చందానగర్ లేబర్ అడ్డాలో కూలీ పనుల కోసం వెళ్తుండేవాడన్నారు. ఈ నెల 9న పనులు ముగించుకొని లేబర్ అడ్డాలోని నీటి ట్యాంక్ వద్ద స్నానం చేస్తున్నాడు. వెంటనే ఒక్కసారి కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే శ్రేయస్ హాస్పిటల్ చికిత్స కోసం తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం సిటిజన్ హాస్పిటల్‌కు తరలించాలని కోరారు. దీంతో సిటిజన్ హాస్పిటల్‌లోని వైద్యులు మోఫిజ్ మృతి చెందాడని ధృవీకరించారు. మోఫిజ్ కుటుంబ సభ్యులు అనుమానస్పందగా మృతి చెందాడని ఆరోపిస్తూ చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.